క్లుప్తంగా

సౌండ్‌సిస్టం బాక్సుల బహూకరణ



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయానికి దాతలు సౌండ్ సిస్టం బాక్సులను శుక్రవారం బహూకరించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన శ్యాంసుందర్, ఉమేష్‌చందర్, రాజేశ్‌శర్మ రూ.20వేల విలువ గల సౌండ్ సిస్టం బాక్సులు ధర్మకర్త ఆరెల్లి సత్యనారాయణగౌడ్‌కు అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిట్యాల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంటర్‌మీడియట్ 2023–24 మొదటి విద్యా సంవత్సరములో ఖాళీగా ఉన్న ఎంపీసీ, బైపీసీ కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ భిక్షపతి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ధ్రువపత్రాలతో కళాశాలకు వచ్చి సంప్రదించగలరని తెలిపారు. చివరి తేది ఈ నెల 28 వరకు ఉంటుందన్నారు.

నియామకం



టేకుమట్ల(రేగొండ): దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక మండల అధ్యక్షుడిగా రేగొండ మండల కేంద్రానికి చెందిన మేరుగు చంద్రమౌళిని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు నీలాంబ్రం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనపై నమ్మకంతో అవకాశం కల్పించిన జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి చంద్రమౌళి కృతజ్ఞతలు తెలిపారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

కాటారం: 18 సంవత్సరాలు నిండిన యువత, వయోజనులై ఓటర్ లిస్టులో పేరు నమోదు కాని వారు, అర్హులైన ప్రతి ఒక్కరూ నేడు(శనివారం), రేపు(ఆదివారం) ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమంలో ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటరు నమోదు దరఖాస్తులను సంబంధిత పోలింగ్ ప్రాంత బీఎల్వోలకు గానీ తహసీల్దార్ కార్యాలయంలో కానీ అందజేయాలని సూచించారు.

మొక్కల పంపిణీ



భూపాలపల్లి రూరల్: వరద ముంపునకు గురైన భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లిలో ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ మారుతి ఆధ్వర్యంలో ఇంటింటికీ పండ్ల, పూల మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వైస్ చైర్మన్ ఓరుగంటి సాగర్, ఫౌండేషన్ సభ్యులు పోషన్న, రాంబాబు, మధు, శ్రావణ్, నాగరాజు, రాకేష్, హరీష్, రవి తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు డీఎస్పీ ప్రచారం



మొగుళ్లపల్లి: మండల కేంద్రంలో ధర్మసమాజ్ పార్టీ (డీఎస్పీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గడప గడపకు ప్రచారం అనే కార్యక్రమాన్ని జిల్లా ప్రచార కమిటీ సభ్యులు మంద రమేష్ మహారాజ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ పిలుపు మేరకు మండలంలోని ప్రతి గ్రామాన్ని, ప్రతి గడపను తిరిగి పరిచయ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. మండల ప్రచార కమిటీ సభ్యులు జన్నే లక్ష్మణ్ మహారాజ్, దూడపాక శ్రీకృష్ణా, మనోజ్, శ్రీధర్, శ్యామ్, తరుణ్, సంపత్, రాజు, నిక్షిత్, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మంగపేట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్ కుమార్ అన్నారు. మండలంలోని పాత బ్రాహ్మణపల్లిలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య బృందం, హెల్త్ ఎడ్యుకేటర్ జయశ్రీ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



రేగొండలో అమ్మవారిని గజవాహన సేవలో ఊరేగిస్తున్న భక్తులు

భూపాలపల్లి అర్బన్: శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ పూజలను జిల్లా వ్యాప్తంగా మహిళలు నిర్వహించుకున్నారు. జిల్లా కేంద్రంలోని సింగరేణి వర్క్‌షాపు అవరణంలో దుర్గమాత ఆలయం, వేంకటేశ్వరాలయం, శివాలయం, శ్రీభక్తాంజనేయదేవాలయాల్లో ఆలయ అర్చలకు ప్రత్యేక పూజలు నిర్వహించగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వరలక్ష్మీ పూజలు, కుంకుమర్చనలు చేశారు. ఇళ్లలో కుడా మహిళలు వరలక్ష్మీ పూజలు చేయి ముత్తాయిదులకు వాయినాలు సమర్పించారు.

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణమాసంలో భాగంగా శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం అమ్మవారిని గజవాహన సేవలో మాడ వీధుల గుండా ఊరేగించారు. వరలక్ష్మీ వ్రత కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు హాజరై వరలక్ష్మీ వ్రత పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ బిల్ల శ్రీనివాస్, చైర్మన్ మాదాడి అనితాకరుణాకర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది రవి, సుధాకర్, శ్రావణ్, ఆలయ కమిటీ సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మల్హర్: మండలంలోని ఆయా గ్రామాల్లో వరలక్ష్మీ వ్రతం వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని తాడిచర్ల వేంకటేశ్వర ఆలయంలో, పెద్దమ్మతల్లి ఆలయం, మల్లారం హనుమాన్ దేవాలయంలో అర్చకుల ఆధ్వర్యంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమలతో సామూహిక వ్రతాలు చేశారు.



భూపాలపల్లి అర్బన్: పూజలు చేస్తున్న మహిళలు



మల్హర్: మల్లారంలో పూజలు చేస్తున్న మహిళలు



రేగొండలో..

సర్వాయి పాపన్న జయంతి వేడుకలు



కేక్ కట్ చేస్తున్న నాయకులు

గణపురం: మండలకేంద్రంలో ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌడ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బత్తిని శివశంకర్ గౌడ్ హాజరై కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు కండే రవి, మండల నాయకుడు కుర్రి స్వామి, గౌడ సంఘం నాయకులు మాదాసు మొగిలి, ల్యాదళ్ల యాదగిరి, చిర్ర యాకయ్య, మామిండ్ల కిష్టస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న నాయకులు

మొగుళ్లపల్లి: మండల కేంద్రానికి చెందిన ఫొటో గ్రాఫర్ పెండెం రాజేందర్ కుమారుడు వినయ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా ఫొటో గ్రాఫర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ కుటుంబ భరోసా కార్యక్రమం ద్వారా రూ.1.55 లక్షల విలువ గల చెక్కును ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గాదే లింగమూర్తి చేతుల మీదుగా శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎండీ.రఫీ, మండల అధ్యక్షుడు నాసాని విద్యాసాగర్, కార్యవర్గ సభ్యులు రంగు రవీందర్, మార్కెండేయ, మహేందర్, మార్త రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్



కాటారం: పోలీసుల అదుపులో నాయకులు

సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్న తీరును ఎండగడుతూ కలెక్టరేట్ ముట్టడికి బీజేపీ ఇచ్చిన పిలుపు మేరకు వెళ్తున్న నాయకులను పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం వారిని సాయంత్రం సొంత పూచికత్తుపై వదిలేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. అరెస్టులు చేయడం అన్యాయన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని పేర్కొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



చిట్యాలలో..



రేగొండలో..



మహాముత్తారంలో..



కాళేశ్వరంలో..

రెండో విడత గొర్రెల పంపిణీ



గొర్రెలను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సాగర్

చిట్యాల: మండలంలోని కైలాపూర్ గ్రామంలోని యాదవులకు రెండో విడత గొర్రెలను జెడ్పీటీసీ గొర్రె సాగర్ చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 12 యూనిట్ల గొర్రెలను మల్లికార్జున యాదవ సంఘానికి అందజేసినట్లు తెలిపారు. యాదవుల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న సీఎం కేసీఆర్‌కు యాదవలు రుణపడి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యురాలు మహతి, నాయకులు చింతల సుమన్, యాదవ సోదరులు ఉన్నారు.

పారదర్శకంగా ఎంపిక



మాట్లాడుతున్న తహసీల్దార్ స్రవంతి

పలిమెల: గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ స్రవంతి మండల అధికారులకు సూచించారు. శుక్రవారం మండల కార్యాలయంలో గృహలక్ష్మి పథక లబ్ధిదారుల ఎంపికపై మండల అధికారులతో తహసీల్దార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి, ఆర్‌ఐ రాజశేఖర్, ఐకెపీ ఏపీఎం రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు, మండల ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ చేపట్టాలి



ఫిర్యాదు చేస్తున్న సీపీఎం నాయకులు, కూలీలు

ఏటూరునాగారం: వెంకటాపురం(కె) మండలంలోని మరికాల గోదావరి ఇసుక క్వారీల్లో అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని అధికారులు స్పందించి విచారణ చేపట్టాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ దావూద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో ఐటీడీఏ పీఓ అంకిత్‌కు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కూలీలు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దావూద్ మాట్లాడుతూ.. మరికాల ఇసుక ర్యాంప్‌లో గోదావరి నుంచి కూలీల ప్రమేయం లేకుండా యంత్రాలను ఉపయోగించి తొవ్వకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీంతో రోజువారి కూలి పనులు చేసుకునే ఆదివాసీలు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక రీచ్‌లో లారీ లోడింగ్ చేసినందుకు లారీ డ్రైవర్ రూ.900 చెల్లిస్తే సొసైటీ సభ్యులు పంచాయతీ అభివృద్ధి, గుడి నిర్మాణం ఇతర ఖర్చుల పేరుతో రూ.300 కటింగ్ చేసుకొని రూ.600 చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విచారణ చేపడుతామని పీఓ వెల్లడించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కుమ్మరి శ్రీను, జిల్లా కమిటీ సభ్యులు గ్యానం వాసు, మండల నాయకులు కట్లా నరసింహ చారి, మరికాల ఉప సర్పంచ్ చిలకమ్మ, గౌతమి, రాధ, తిరుపతమ్మ, సుజాత, సీత, రమేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



మృతి చెందిన గేదె

భూపాలపల్లి రూరల్: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన సంఘటన భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని వర్ణం బాల్‌రెడ్డికి చెందిన పాడిగేదె రోజువారిలాగే గ్రామ శివారులోకి మేతకు వెళ్లింది. ఈ క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన ఎర్త్ వైర్‌కు తాకి షాక్ గురై మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని, ప్రభుత్వం విద్యుత్ శాఖ అధికారులు ఆదుకోవాలని బాధితుడు వాపోయాడు.

బీపీ మండల్ పోరాటంతోనే బీసీ రిజర్వేషన్లు



కాటారం: బీపీ మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జక్కు రాకేశ్, నాయకులు

కాటారం: దేశంలో అత్యధిక శాతం కల్గిన బీసీల రిజర్వేషన్ కోసం అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప వ్యక్తి బీపీ మండల్ అని బీఆర్‌ఎస్ యూత్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేశ్ అన్నారు. మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బీపీ మండల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాకేశ్ మాట్లాడుతూ.. బీసీలు అన్ని రంగాల్లో ముందుకెళ్లడానికి ముఖ్య కారణం బీపీ మండల్ కృషి ఫలితమే అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట జనార్ధన్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దబ్బెట స్వామి, డైరెక్టర్ రాజబాబు, ఏఎంసీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, యూత్ వైస్ ప్రెసిడెంట్ ముక్తి తిరుపతి, వంగల రాజేంద్రాచారి, రజనీకాంత్, రవి, సురేశ్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో బీసీ మండల్ జయంతిని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ, బీసీ ఐక్యవేదిక నాయకులు చేపూరి ఓదెలు, పీక కిరణ్‌లు మండల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండల్ కమిషన్ రిజర్వేషన్ ఫలాలను ఇప్పుడిప్పుడే అందుకుంటున్న బీసీలకు క్రిమిలేయర్‌తో ఉన్నత విద్యా సంస్థల్లో ఓబీసీల కోటాలో మిగిలిన సీట్లను కూడా ఆధిపత్య కులాల వారు కొట్టేస్తున్నారని ఆరోపించారు. బీసీల రిజర్వేషన్లను, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడానికి మండల్ సూచించిన విధంగా బీసీలు ఉద్యమించాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఐక్యవేదిక నాయకుడు అక్కల బాపు, జాతీయ బీసీ సంఘం జిల్లా కన్వీనర్ బీర్ల గట్టయ్య, బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి భీమనాథుని సత్యనారాయణ, బీసీ నాయకులు వేమునూరు చంద్రమౌళి, ఇంజాల రమేష్ కానుగంటి రవి, రాపూరి నిర్మల, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లి రూరల్: మండల్ జయంతి వేడుకల్లో నాయకులు

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఏటూరునాగారం: రాష్ట్రంలో విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరును ఎండగడతామని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్ అన్నారు. ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలకు తగ్గట్టుగా ఉపాధ్యాయులు లేరని అన్నారు. స్కావెంజర్లను నియమించాలని తెలిపారు. నాలుగేళ్లుగా బదిలీలు, ప్రమోషన్లు లేవన్నారు. లీవ్ పెడితే సప్లమెంటరీ బిల్స్, జీపీఎఫ్ బిల్స్ ఇవ్వడం లేదని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసమే సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో మహాధర్నా తలపెట్టామని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు లింగారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి బడ్జెట్‌లో విద్యకు సరిపడా నిధులు కేటాయించకుండా ప్రభుత్వ విద్యను నీరుగార్చుతుందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా 25వేల ఖాళీలు ఉంటే 6వేల పైచిలుకు భర్తీ చేయడం విడ్డురంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2020 విధానం పేద ప్రజలు, ఉపాధ్యాయులకు విరుద్ధంగా ఉందని, రాష్ట్రంలో అమలు చేయొద్దని కోరారు. ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

ములుగు: విద్యా, ఉపాధ్యాయ రంగ సమస్యలు పరిష్కరించాలని యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు లింగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సంఘం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని వ్యతిరేకిస్తూ సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ఆయా సంఘాల నాయకులు చాప బాబుదొర, గొప్ప సమ్మారావు, కొండ చెంచయ్య, లక్ష్మీనారాయణ, సమ్మయ్య, సంతోష్‌కుమార్, రమేష్, సిద్ధంకి బాబు, వాసుదేవరెడ్డి, ఆదిరెడ్డి, రాందేవ్, నాగరాజు, సాంబయ్య పాల్గొన్నారు.

కేసీఆర్‌ను నమ్మి మోసపోవద్దు

ములుగు రూరల్: వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. ములుగు మండలంలోని పెగడపల్లి సర్పంచ్ బద్దుల లక్ష్మీతో పాటు మరో 100 పార్టీలోకి చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేస్తానని చెప్పిన సీఎం కేసీఆర్ అప్పుల తెలంగాణ మార్చారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, మండల అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా ఉన్నారు.

ఎస్ఎస్ తాడ్వాయి: తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించి గెలిపించాలని ఆ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క అన్నారు. మేడారం సమ్మక్క సారలమ్మ సన్నిధిలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు భిక్షపతి గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమగాని అనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం జంగాలపల్లి, ఇంచర్ల, బంజర్‌పల్లి, రాంనగర్ క్రాస్ గ్రామాలకు చెందిన 60 మంది కల్లుగీత కార్మికులు పార్టీలో చేరగా వారిని సీతక్క కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన ఎస్సై



ఆస్పత్రికి తరలిస్తున్న ఎస్సై షాఖాన్

చిట్యాల: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. వెంటనే క్షతగాత్రులను చిట్యాల ఎస్సై ఎండీ షాఖాన్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి.. చిట్యాల నుంచి జిల్లా కేంద్రానికి రాత్రి 9.30 గంటల సమయంలో ఎస్సై ఎండీ షాఖాన్ సిబ్బందితో వెళ్తున్నాడు. ఈ క్రమంలో హనుకొండ జిల్లా ధర్మసాగర్‌కు చెందిన భవాని, శ్రీకాంత్ భూపాలపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మోరంచపల్లి–కుందయ్యపల్లి గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీకొట్టడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అటుగా వెళ్తున్న చిట్యాల ఎస్సై షాఖాన్ స్పందించి పోలీస్ వాహనంలో వారిని తక్షణమే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది రవీందర్, అప్పల స్వామి ఉన్నారు.